# అడుగుజాడలు ★

కాంత నిద్రపోతూంది; పడకటింటి గదిలో, సువాసనా సంకలిత ప్రమత్తతో-ఏకాంతంగా. కాని బయట ఎవరో వస్తున్నట్టు, తన్ను చూడాలని కోరుతున్నట్టు, దాసీది ఆడ్డు పెడుతూన్నట్టు, అలికిడై- వెంటనే వెచ్చని రగ్గులో వున్న తన ముఖాన్ని తప్పించి, కాళ్ళు ముందరకు లాక్కుంటూ, చేతులు జాడించి, లేచి అద్దం ముందరకొచ్చి రేగివున్న ముంగురులనీ, సన్నటి నల్లటి కనుబొమ్మల్నీ సవరించుకొని, ఎందుకో అర్థంలేని ఒక్క నవ్వు నవ్వుకొని, లేచి బయటికి తొంగిచూచింది, కిటికీగుండా-పై అంతస్తులో వుండి. ఆమె ఎవరో కాదు తన ముఖ్య స్నేహితురాలు వేద. అయినా యింత త్వరగా రావటానికి కారణం? రోజూ-పదకొండూ, పన్నెండు కానిదే, రెండు మూడుసార్లు రమ్మని ఫోనులో పిలవనిదే, వొచ్చేది కాదే, ఇవ్వాళ ఇంత త్వరగా రావటానికి కారణం కాంతకి బోధపడటం లేదు.

"అప్పుడే వొచ్చావేం? ఇంత తొందరగా-తొమ్మిదికూడా కాలేదే!" అన్నది కాంత, ఒక చంప అశ్చర్యపడే స్వరంతో.

పదిహేను లంకణాలుచేసి తీసుకొని తీసుకొని వున్న రోగికి- పదహారో రోజు పథ్యం పెట్టితే ఆ రోగిలోవున్న కళత్వం వేదలో కనబడుతూన్నది. ముఖమంతా పాలిపోయి, తెల్లగా బలహీనంగా వుంది.

'నీతో నేను అవసరంగా మాట్లాడాలి, ఒక భయంకరమైన విపత్తు సంభవించింది' అన్నది వేద-అర్థంకాని ఆత్రుతతో, అనంతమైన ఆవేశంతో.

కాంత ఇంకో గదిలోకి తీసికెళ్ళి కూచోపెట్టి గదినంతా నిశ్శబ్దంలో ఉంచి-'ఏంజరిగిందో సమగ్రంగా చెప్పు' అన్నట్టు చూసింది, వినే దానిపోజులో.

కాని ఎందుకో వేద పెద్దగా యేడ్చింది. అశ్రుకణాలు మెరుస్తూ స్వేచ్ఛగా క్రిందకు రాలినయ్. క్రొత్త అందాన్ని కల్పిస్తూ.

'ఏం చెప్పమంటావ్ కాంతా! ఏం చెప్పేది? ఆ భయంకర విషయాన్ని గురించి రాత్రల్లా కంటి మీద కునుకు లేకుండా ఆలోచించాను. ఏదో భయం నన్నావహిస్తూన్నది. చూడు గుండె మీద చేయిపెట్టితే నీకే తెలుస్తుంది. కాంత చేయిని తన గుండె మీదకు పెట్టింది.

నిన్న సాయంత్రం ఎంతయిందో ఖచ్చితంగా చెప్పలేను కాని నాలుగు గంటల ప్రాంతాన డ్రాయింగు రూములో కిటికీ దగ్గర కుర్చీలో కూర్చున్నాను. బజార్లో జనాన్ని చూస్తూ. ఉత్తరంగా వీచే చల్లని గాలిని అనుభవిస్తున్నానుగాని ఎటువంటి ఆలోచనలతో బుర్రను చెడగొట్టుకోవడం లేదు.'

'హటాత్తుగా నా దృష్టి ఎదురుగ్గా వున్న మేడ మీదకు వెళ్ళింది. ఎవరో, స్త్రీ ఎర్రని దుస్తులు ధరించింది. కిటికీలో చెంపకు కుడిచేయి అనించి నవ నాగరికపు చూపులతో చూస్తున్నది. ఆకర్షిస్తున్నది నాకు భలే అసహ్యం వేసింది. అసలు ఆ అసహ్యం ఆమెను చూచిన మొదట్లోనే కలిగింది, మరో స్త్రీ నే కూర్చున్న స్థలంలో, నాకు మల్లేకూచోడం- నా మర్యాదకీ, నీతికీ, హోదాకీ స్థితికీ అంతరాయం కలిగినట్టు కనబడి ఆమంటే నీచత ఏర్పడింది. కాని ఇంత చెడ్డ అభిప్రాయం

సులోచన

ఆమెను గురించి వున్నా ఆమె సంచరించే సంచలనంలో, చూసే చూపులో కూచున్న భంగిమలో బజార్న పోయే ప్రతి వ్యక్తిని అంతపెద్ద మేడ మీద మూడో అంతస్తులో వుండి - ఇట్టే ఆకర్షిస్తూన్నందుకు నాకు ఎక్కడో ఆ ఆకర్షణ మెత్తదనంలో సంతోషం కలుగుతున్నది. అడవిలో తిరిగే పక్క మృగాల్ని పసిగట్టేటట్లు ఆకలితో మాడే బిచ్చగాడు అన్నంయొక్క వాసనని కనుక్కొనేటట్లు బజార్న పోయే ప్రతి పురుషుడూ, ఏ పనిమీద పోతున్నా కూరగాయలు తీసుకురావడానికి పోతున్నా, రైలుకళ్ళాలని వెళుతున్నా, మరో అర్జంటు పనిమీద వెళుతున్నా సరే, తలపైకెత్తి ఆమెకేసి చూడటం - ఆమె చూపుల్లో 'మీరు వస్తారా?' అనే భావం,ఆశ ధ్వనించడం, వాళ్ళ చూపుల్లో 'నాకు టైములేదు ఎలా?' 'ఇవ్వాళ కాదు-వీలుపడదు. రేపు' 'నా జేబులో దమ్మిడీపైతం లేదు'- ఓ కాముకీ! నీ కామ వ్యాపారంతో మమ్మల్నెన్నాళ్ళు చంపుతా! వెళ్ళి నీ తలకాయని ఇంట్లో దాచుకో! అనే రకరకాల మనస్తత్వాలు ప్రతిఫలించడం- ఈ వ్యవహారం ఆమెకు నిత్యకృత్యమైనప్పటికీ వృత్తిధర్మమైనప్పటికీ, చూచేందుకు ఆశ్చర్య జనకంగానూ, వింతగానూ వుంటుంది.

'తలుపు మూసివేయడంతో నాకు తెలిసి వొచ్చేది ఎవరో మర్యాదగల పురుషుడు, డబ్బుగల పురుషుడు-గాలానికి చేప చిక్కినట్టు' ఆమెకు చిక్కాడని. కాని చిత్రమేమిటంటే ఆ వెళ్ళిన పురుషులెవ్వరూ అరగంట కంటె ఎక్కువసేపు ఆ గదిలో వుండే వాళ్ళుకాదు. ఇంతా చూస్తుంటే నాకు కొన్ని ప్రశ్నలు కలిగినై. తన స్వభావాన్ని అందాన్నీ, మర్యాదనీ ఇతరులు అర్థం చేసుకో గలిగేటట్టు. ఆకర్షించ గలిగేటట్టు, చేయడంలో ఆమె ఏసూత్రాన్ని అవలంభిస్తున్నది? కేవలం ఈ వ్యాపారానికి అందమైన చూపులే ఆధారపడుతున్నాయా? ఈ ప్రశ్నలు నాలో బలంగా తీవ్రంగా కలగడంచేత ఆమె అంగవిన్యాసాన్ని వీక్షించడానికి కిటికీ అద్దాల్ని తెరచి పరిశీలించాను ఒకరోజు, మొదట్లో ఆమె ఒక్క చూపేచూస్తుంది. ఓరగా ఆ పైనపెదాలమీద అందమైన చిరునవ్వు, కొంచంగా తలకాయ వూపడం 'నీవు మేడమీదకు వొస్తున్నావా?' అనేట్టు- ఆమెచేసే ఈ సంజ్ఞల్ని అర్థం చేసుకోవడానికి ఎంతో నేర్పు అవసరమని గుర్తించాను. కొన్నాళ్ళు గడిచాక ఆమె అలా చేయటం నాలో ఒకభావాన్ని రేకెత్తించింది. 'నేనుకూడా ఇలా ఆమెకు మల్లే చేయగలుగుతానా?' అనే భావాన్ని.

"వెంటనే నిలువుటద్దం దగ్గరకువెళ్ళి ఆమె చేసిన ప్రతి చిన్నపనినీ ఎంతో తీక్షణతగానూ నేర్పుగానూ సున్నితంగానూ చేశాను-అలాచేయటంవల్ల కొంతసేపటికి నాకు తెలిసి వచ్చిందేమిటంటే- ఆ పనిలో ఆమెకంటె నేనే గొప్పగా చేశాను నాకే ఎక్కువ ఆకర్షణగా వున్నది అవి నిజానికి అలాగే కనపడ్డది."

"రోజులు గడుస్తున్నవి. కాని ఆమె ఆ వ్యాపారంలో మునుపటికి మల్లే కృతకృత్యురాలు కాలేకపోతున్నట్టు కనబడుతున్నది. ఆకర్షించే జనం తక్కువ మందిగా కనపడుతున్నట్టు తెలుస్తున్నది. ఎవరికైనా ఆ వృత్తితో కేవలం కడుపు నింపుకోవటం కష్టతర సాధ్యం. ఆవృత్తి భయంకర సాదృశం అయినా మహా చెడ్డది అవినీతి అసహ్యం-అని మనసుకు తెలిసినా అప్పుడప్పుడు బజార్లో వెళ్తే అందమైన యువకులు కనపడగానే ఆనందం కలుగుతూనే వుంటుంది.

ఆమె ఆ వ్యాపారంలో కృతకృత్యురాలుకాలేక పోయినప్పట్నుంచీ నా మేడమీద, ఆమెకు మల్లేనేను కూర్చొని సంజ్ఞలు చేస్తూండటం మూలాన బజార్లో వెళ్ళే అన్నిరకాల పురుషులూ నల్లటివాళ్లు ఎర్రటివాళ్లు చాయనచాయవాళ్ళు అందం లేనివాళ్ళు అందం కలవాళ్ళు ముసలివాళ్ళు వయస్సులో వున్నవాళ్ళు వయస్సు లో వుండి లేని

వాళ్ళూ నావంకే చూడటం మొదలెట్టారు. నేనే గనుక ఆమెకు మల్లే సంజ్ఞలు చేస్తే చేతులు వూపితే కళ్ళు ఆడిస్తే కళ్ళతో ఓరగా చూస్తే- వాళ్ళు నా దగ్గరకి రాగలుగుతారా?- నేను మర్యాదస్తుల కుటుంబానికి చెందివున్నాను గాబట్టి వాళ్ళు నా దగ్గరకి రాగలుగుతారా? ఇదే కాకుండా ఆకర్షించగలనో లేనో అన్న కోరిక నాలో బలవత్తరంగా పాకుతూ పోయింది. ఈ కోరికను వ్యతిరేకించి మనస్సు సక్రమ మార్గంలో పెట్టుకోవటం నాకు చాలా కష్టంగా కనపడింది. ఈ విషయాలు చాలా నీచంగా వున్నప్పటికీ, తుచ్ఛమైనప్పటికీ వాటిని అపగలగటం, మనస్సులో దిగమింగుకోవడం చాలా కష్టం. మన స్త్రీ హృదయాల్లా కొంత మంది హృదయాలు కోతిహృదయాల్లాంటివి అనే దాంట్లో నాకు ఏమాత్రమూ విశ్వాసముంది. వెనకటికి ఒక డాక్టరుగారు బోలు మన మనస్సులకూ, కోతుల మనస్సులకూ అవినాభావ సంబంధం కొద్దో గొప్పో వున్నదని చెప్పినట్టు జ్ఞాపకం. ఏదిఏమైనా మనం ఎప్పుడూ ఒకళ్ళమీద ఒకళ్ళ ఆచారాలను అనుకరిస్తూ వుంటాము, అది సహజం అయిపోయింది. మొదట్లో ప్రేమించినప్పుడు భర్తల్ని అనుకరిస్తాము, పెళ్ళయిన కొన్నాళ్ళకి ప్రక్క స్నేహితుల వాతావరణాన్ని బాగా అందంగల మగాళ్ళని అనుకరిస్తాము; వాళ్ళ ఆలోచనలనీ, అభిప్రాయాలనీ, ఆశయాలనీ, మాట్లాడే విధానాన్నీ ఫోజుల్నీ గుడ్డిగా నమ్మి మంచి చెడ్డలు ఆలోచించక తంత్రంగా అనుకరించటం అవివేకం తప్ప మరొకటి కాదని నా ఉద్దేశ్యం. ఇంతకీ నా మనస్తత్వం ఏమంటే, నన్ను ఏవిషయమైతే మథ్యపెట్టి బాధలో ముంచుతుందో- దాన్ని చేసితీరాలనే పట్టుదల; ఆ విషయం చేసితీరే దాకా సడలని దీక్ష ప్రచండంగా వుంటుంది. అందువల్ల సంప్రాప్తమయ్యే సాధక బాధకాల సంగతి విచారించే పరిపక్వత ఇంగితజ్ఞానం ముందరగా లేకపోయినా, తరువాత ఆ లేక పోవటాన్ని గురించిన్నూ, కలిగివుండక పోవటాన్ని గురించిన్నీ, విధినీ, కర్మనీ దూషిస్తూ బాధపడను. బాధలోనే తృప్తిపొందటం, ధైర్యాన్నికాని తెచ్చుకోవడం కొంతవరకు నాకు తెలీకపోదు. అంతకుముందుగా చెప్తున్న విషయాన్ని ఓ అందమైన యువకుడిమీద ప్రయోగించదలుచుకున్నాను. ఈ వృత్తిని నేను స్వీకరించదలుచుకోలేదు గాబట్టి. ఈ వృత్తివల్ల నేను జీవనం చేయబోటం లేదు గాబట్టి, డబ్బుకోసం కాదు గాబట్టి- ఏంత అనాకారిమీదనైనా వుపయోగించదలుచుకోలేదు- ఇంకొక కిటుకు ఏమిటంటే, మా యిద్దరి సంజ్ఞల్నీ చిన్న నవ్వులతో ఆరంభించదలుచుకొన్నాను. ఎందుకంటే తీరా అతను వచ్చాక నేను నవ్వలేదని చెప్పటానికి అవకాశం వుంటుంది కనక.

'అందంగల యువకుణ్ణి ఏరుకొని ప్రయోగం ప్రయోగించాలని ఆ స్థలంలోనే కూర్చున్నాను. అటు చూస్తున్నాను. ఎవ్వరూ నా కండ్లకి అంతగా నచ్చడంలేదు. నావైపైతే చాలామంది చూస్తున్నారుకాని ఆ చూపులు నన్ను ఆకర్షించడంలేదు. నా చూపులు ఆకర్షించితే ఆకర్షించచ్చు- ంత సేపు కూచున్న తరువాత ఒకతను తదేకదీక్షతో నావంకే తలపైకెత్తి చూస్తున్నట్టు కనపడింది నాకు. సన్నగా, పొడగరి- అందంగలవాడు. అతనివంక నేను చూడగానే అంతకుముందు నుంచీ అతను నావంక కోరికగా చూస్తున్నట్టు కనపడింది. కొంచంగా నవ్వి చేయి కదిపాను, అతనూ నవ్వి తలకాయ ఆడించాడు. అంతే నవుకున్నాను. కాని అతనికి పైకివొచ్చే ధైర్యం చాలదనుకున్నాను. తీరా అతను ఇంటిముందు పెద్దవాకిలి దగ్గరకొచ్చాడు. అప్పుడు నా గుండె వేగంగా కొట్టుకోవటం ఆరంభించింది- భయం ఆవరించటం జరిగింది. వొళ్ళు వొణికిపోతున్నది. నాక్షణంలో పిచ్చిదాన్నయి పోతానేమోనన్న అనుమానం కూడా మెరిసింది. అతను ద్వారందగ్గర కొచ్చి చూస్తున్నాడు- పైకిరావటానికి మెట్లుఎక్కడ అన్నట్టు.'

‘గేటుదగ్గర పనిమనిషి వుంటాడు. అతనంటే నాభర్తకి ఒకవిధమైన నమ్మకంవుంది. ఒకవేళ ఆవొచ్చినవ్యక్తి ఈపనిమనిషికి కనబడతాడేమోనన్న అనుమానం మరీ భయంలోకి లేపింది ’

‘ముందరగా పరుగెత్తుకెళ్ళి నేను నిన్ను పిలవలేను. పొరపడ్డావు. నాభావం అదికాదు’ అని చెబుదామనిపించింది. అలాచెపితే వింటాడులే అనే వూహ పోయింది. అమాత్రం దయవుండక పోతుందా అనుకొంటూ క్రిందికి దిగాను. అతను బెల్ మ్రోగించటానికి ప్రయత్నాలు చేస్తుండగా “మీరువెంటనే వెళ్ళిపొండి. పొరపాటు పడ్డారు. మీలాగా పోలికలుగల నాకొక స్నేహితుడున్నాడు. అతనన్నేవుద్దేశంలో ఆపని చేశాను. నామాట విని వెళ్ళండి. దయచేసి’ అని మోటుగా మాట్లాడాను. కాని అతనుమాట ఆలకించందే! ఒక మందహాసంచేసి, ‘నీవిషయిం నాకు తెలుసులే ముఫయిరూపాయలు చాలకపోతే ఇంకొపదిరూపాయలు ఇస్తాలే. ముందు పైకిదారి చెప్పు’ అని అన్నాడు.

‘నేనెంతగా బతిమాలుతున్నా, వేడుకుంటున్నా నామాటవినకుండా లోపలకువచ్చి తలుపు బిగించాడు. భయభ్రాంతురాలినై కాలూ చేయి ఆడని పరిస్థితి ప్రాప్తించి, అయోమయంగా చూస్తున్ననన్ను ప్రక్కగావొచ్చి ముద్దుపెట్టుకున్నాడు. నాసన్నని నడుముకు తన హస్తాల్నిచుట్టి లోపలగదిలోకి తీసుకెళ్ళాడు.’

‘అబ్బా’ నీగదులు చాలామెరుగులతో అందాలతో మెరుస్తున్నవే. ఈ కిటికీవ్యాపారం చేయడం మొదలుపెట్టడంవల్ల అదృష్టం నీవైపు నడుస్తున్నట్టుంది.’ అన్నాడు. మైకంకమ్మిన కళ్ళతో గదిలోనిగోడలకు తగిలించివున్న ప్రఖ్యాత చిత్రకారుల చిత్రాన్ని తిలకిస్తూ.

‘నాభర్త వచ్చేవేళయింది. మీరు కేవలం పొరపాటుపడ్డారని ఒట్టు పెట్టుకు చెబుతున్నాను. నామాట ఆలకించి వెళ్ళండి’ అనిమళ్లీ ప్రార్థించాను కాని అతను మొండివాడులాగ కనిపించాడు, నిర్దాక్షిణ్యంగా ‘నేను స్త్రీదుర్వ్యవహారాలన్నిటినీ ఎరుగుదును, నాకిటువంటి విషయాల్లో ఎంతో అనుభవముంది. నీభర్తేగనుక వచ్చేటట్లయితే, పోనీ- ఏంపోయింది కొన్నిరూపాయలిద్దాం. ఎదురుగావున్న హోటిల్లోకిపోయి తాగి తందనాలాడొస్తాడు’ అన్నాడు!

గోడమీదవున్న నాభర్త ఫోటోవంక ఎగాదిగా చూసి, ఎందుకోనవ్వుతూ— ‘నీభర్తేనా?’ అని అడిగాడు.

‘అవును’ అన్నాను, ముక్తసరిగా.

‘అందంగా వున్నప్పటికీ ఆకర్షణీయంగాలేదు!’ ఇంకా కొంచందూరం పచారుచేసి— ‘ఓ! ఈ ఫోటో ఎవరిది? బహుశా నీస్నేహితురాలివై వుండొచ్చు!’

‘ఊఁ!’ అన్నాను.

నీహృదయంలో రైళ్ళుపరుగెత్తుతున్నవి. ఇంకా వెళ్ళడేం? అని ఎదురుచూస్తున్నాను.

ఇంకా సంభాషణ పొడిగిస్తున్నాడు. ‘ఆమె చాలాబాగుంది. నాతోపరిచయం చేయగలవా?’

అప్పుడేగడియారం అయిదుగంటలు కొట్టింది. ఇంకోఅరగంటలో నాభర్తవస్తాడు. ఒకవేళ ఖర్మంచాలక ముందుగా నేవొస్తే— ఎన్నిసార్లు రాలేదు? వీడుయింట్లోనుంచి వెళ్ళకముందే— కొంపనిలువునా మునుగుతుంది. అప్పుడు నాహృదయం ఎలాగుందో ఆలోచించుకొంతా? నాతల గిర్రున తిరిగింది. క్రిందపడిపోతానా అనిపించింది ఈ విషమపరిస్థితుల్లో యేదోఒక విధంగా వీణ్ణి ఒదిలించుకోవడమే ప్రధానంగా తోచింది. అదే వుత్తమమైన పనని అనుకొన్నాను.

★

శాంత దిండులో తలదూర్చి నవ్వటం మొదలు పెట్టింది. వేదకి అర్థం కాలేదు.

"ఆయన చాలా అందంగా వున్నాడు కదూ!"

"ఆఁ!"

"మరి నీ వెందుకంత క్షోభపడతావు?" అన్నది శాంత నిర్మలంగా.

'కాని సరిగ్గా రేపీసమయానికే వస్తానన్నాడు. నేనుచాలా భయకంపితురాలనైనాను. అతను గొప్పగ మంకుపట్టు కలవాడుగా కనిపించాడు. నాకు భయం వేస్తున్నది. అతనుతప్పక వస్తాడు.'

'నేనేం చేయను. త్వరగా చెప్పు శాంతా'

శాంతమెల్లగా మంచంపైనించి లేచికూర్చుని కొంచంసేపు దీర్ఘంగాఆలోచించి— 'నీవతనిని అరెస్టు చేయించాలి!' అని అన్నది.

వేద చాలా ఆశ్చర్యపోయింది. 'నీవుదేన్నిగురించి ఆలోచించి చెపుతున్నావు. అతన్నా..... అరెస్టుచేయించడం! ఏంకారణం లేనిదే!'

'ఇది అల్పవిషయం. పోలీసు సూపర్నెంటు దగ్గరకువెళ్ళి' ఒక యువకుడు మూడునెలల్నుంచీ నన్ను వెంబడిస్తున్నాడు. నిన్నచాలా అసభ్యంగా గృహంలో ప్రవేశించాడు. రేపుకూడ అదేసమయానికి వస్తానని చెప్పి వెళ్ళాడు.' అనిచెప్పి పోలీసురక్షణ కావాలనికోరు. అతడుకొంతమంది రక్షకభటుల్ని పంపిస్తాడు అరెస్టుచేయొచ్చు.

'కాని అతను జరిగినవిషయం చెప్పేస్తే'

"అతను మాటలు విశ్వసించరు. ఎందుకంటె నీవు మర్యాదస్తుల కుటుంబానికి సంబంధించిన వ్యక్తివిగనుక నీమాటల్నే విశ్వాసానికి తీసుకుంటారు"

'నాకావిధంగా చేయటానికి ధైర్యంచాలటం లేదు' అన్నది వేద.

"నీవు ధైర్యం తెచ్చుకోవాలి. లేకపోతే నీ జీవితం మచ్చపడుతుంది"

'అతను అరెస్టయితే- నన్ను దూషిస్తాడు'

"నీకు సాక్షులుంటారు. అతన్నిశిక్షిస్తారు'

'ఏమిశిక్ష'

'కొంతడబ్బు. అటువంటివిషయాల్లో చాలా నిర్దాక్షిణ్యంగా వుండాలి'

"కాని ఒకవిషయం నన్ను కలతపెడ్తోంది. అతను వెళుతూ వెళుతూ, నలభై రూపాయలు డ్రాయరుమీద పెట్టివెళ్ళేడు"

"నలభైరూపాయలా?"

'అంటే ఆడబ్బు నన్నుచాలా అవజ్ఞ పరుస్తున్నది. ఆడబ్బునేం చేయమంటావు?'

శాంత ఆలోచించి— గంభీరస్వరంతో—

'ఆడబ్బుతో, ఏదో ఒకవస్తువుకొని నీభర్తకు పసదనంగా యివ్వు' అనిఅన్నది.

(మొపాసాకథకి అనుకరణ)

